# జీవన్‌రెడ్డివి అబద్ధాలే

- ఓట్ల కోసం.. రాజకీయం కోసం ఎన్నైనా చెప్తడు
- గతంలో లారీ ఓనర్స్ అసోసియేషన్‌కు ఫేక్ ప్రొసీడింగ్ పత్రం ఇచ్చిండు
- మేమే స్థలం కేటాయించి మున్సిపల్‌లో తీర్మానం చేసినం
- జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్
- జగిత్యాల లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం
- హాజరైన ఎల్ రమణ, రాజేశంగౌడ్


లారీ ఓనర్స్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల కలెక్టరేట్, నవంబర్ 27: ఓట్ల కోసం.. రాజకీయం కోసం జీవన్‌రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నాడని, జీవన్‌రెడ్డి జగిత్యాలకు చేసిందేమీ లేదని జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్ మండిపడ్డారు. లారీ ఓనర్స్ అసోసియేషన్‌కు భూమి కేటాయిస్తూ జీవన్‌రెడ్డి ఫేక్ ప్రొసీడింగ్ ఇచ్చి లారీ యజమానులను మోసం చేశాడని విమర్శించారు. సోమవారం జిల్లా కేంద్రంలో జగిత్యాల లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. జగిత్యాల అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జులు ఎల్ రమణ, మాజీ మంత్రి రాజేశంగౌడ్‌తో కలిసి సంజయ్ హాజరై మాట్లాడుతూ, లారీ ఓనర్స్ అసోసియేషన్‌కు ఎస్సారెస్పీ స్థలాన్ని ఇస్తున్నట్లుగా జీవన్‌రెడ్డి ఫేక్ ప్రొసీడింగ్ పత్రాన్ని అందజేసి మోసం చేశాడని అన్నారు. కానీ తాము అలా చేయలేదని, లారీ ఓనర్స్ అసోసియేషన్ కోసం స్థల కేటాయింపునకు మున్సిపల్‌లో తీర్మానం చేయించి, సర్వే చేసి ఫైల్‌ను కలెక్టర్‌కు అప్పగించామన్నారు. ప్రొసీడింగ్ వచ్చే సమయంలోనే ఎలక్షన్ కోడ్ రావడంతో ప్రక్రియకు అంతరాయం కలిగిందని, ఎన్నికలు ముగిసిన వెంటనే ప్రొసీడింగ్ పత్రాలను అందజేస్తామన్నారు. అదే విధంగా మైనార్టీలకు 10 ఎకరాల స్థలాన్ని మంజూరు చేశామని, మైనార్టీ వెల్ఫేర్ శాఖ ఉత్తర్వులు కూడా ఇచ్చిందని, బీసీ వర్గాలకు చెందిన వివిధ కుల సంఘాలకు, ఎస్సీలకు సైతం టీఆర్‌నగర్‌లో స్థలాలు మంజూరు చేశామన్నారు. జగిత్యాలలో ఇప్పుడున్నవన్నీ గతంలో ఎమ్మెల్యే, మంత్రి, ఎంపీగా చేసిన రమణ, రాజేశంగౌడ్ చేసినవేనని, వాటినే జీవన్‌రెడ్డి తాను చేశా అని చెప్పుకుంటుంటూ సింపతీ కోసం తాపత్రయపడుతున్నాడన్నారు. జీవన్‌రెడ్డి ముస్లింలకు చేసింది కూడా శూన్యమేనన్నారు. ఐదేండ్లలో తాను ఇస్లాంపురాను అద్దంలెక్క చేశానని, ప్రతీ మసీద్‌కు నిధులిచ్చినానని, బస్తీ దవాఖాన ఏర్పాటు చేశామని చెప్పారు. చింతకుంట చెరువు అప్పుడెట్లుండె.. ఇప్పుడెట్లయ్యిందో చూడాలని, చెరువును అద్భుతంగా తీర్చిదిద్దామని, చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ పెట్టడంతో ప్రజలతో పాటు ముస్లిం మహిళలు కూడా వాకింగ్ చేస్తున్నారన్నారు. ఇదంతా కండ్ల ముందే కనపడుతున్నదని, తాను పేదోళ్ల పక్షాన ఉండేటోన్ని.. పనిచేసినోన్ని కాబట్టే ఓట్లడుతున్నానని అన్నారు. వైద్యుడిగా ఉన్నప్పుడు ప్రజా సేవ చేశానని, ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయినప్పటికీ ప్రజల్లోనే ఉన్నానని, గెలిచినంక మీ తోనే ఉండి మీ కష్టసుఖాల్లో భాగస్వామినయ్యాయనన్నారు. కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్మన్ జీఆర్ దేశాయి, ఏఎంసీ మాజీ చైర్మన్ దామోదర్‌రావు, జిల్లా ఆర్టీఏ మెంబర్ సుధాకర్‌రావు, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆసిఫ్, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కలీం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### సంజయ్‌కు మద్దతుగా న్యాయవాదుల ప్రచారం

సారంగాపూర్, నవంబర్ 27: జగిత్యాల బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు మద్దతుగా జగిత్యాలకు చెందిన పలువురు న్యాయవాదులు సోమవారం సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెంబట్ల, కోనాపూర్, రేచపల్లి, బీర్‌పూర్ మండలంలోని నర్సింహులపల్లి, తుంగూర్ తదితర గ్రామాల్లో 30 మంది వరకు న్యాయవాదులు సంజయ్ కుమార్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా డాక్టర్ సంజయ్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అభివృద్ధి చేసే వారికే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఎమ్మెల్సీ కవిత రోడ్ షో

జగిత్యాల కలెక్టరేట్, నవంబర్ 27: పట్టణంలో ఎమ్మెల్సీ కవిత మంగళవారం పర్యటించనున్నట్లు జగిత్యాల ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలో ఎమ్మెల్సీ కవిత రోడ్ షో నిర్వహించనున్నారని, మధ్యాహ్నం జగిత్యాల టవర్ సర్కిల్ నుంచి నాయుడు దవాఖాన చౌరస్తా మీదుగా, అన్నపూర్ణ చౌరస్తా, పాత బస్టాండ్, తహసీల్ చౌరస్తా వరకు రోడ్ షో ఉంటుందన్నారు.

### 28 నుంచి 30 వరకు మద్యం దుకాణాలు బంద్

జగిత్యాల, నవంబర్ 27: రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజ్ ఆదేశాల మేరకు ఈనెల 30న జరిగే పోలింగ్ దృష్ట్యా మద్యం దుకాణాలు బంద్ పాటించాలని జిల్లా ఎక్సైజ్ అధికారి పి శ్రీధర్ తెలిపారు. జిల్లాలోని అన్ని మద్యం దుకాణాలు, బార్లు, రెస్టారెంట్లు, కల్లు దుకాణాలు, కల్లు డిపోలు మంగళవారం 28 సాయంత్రం 5 గంటల నుండి, 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు బంద్ పాటించాలన్నారు. అలాగే ఓట్ల లెక్కింపుతో 3న మొత్తం బంద్ పాటించాలని సూచించారు.

### పోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలి

జగిత్యాల, నవంబర్ 27: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులు సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ, ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటు, ఈవీఎం యంత్రాల తరలింపు, కౌంటింగ్ ఏర్పాట్లు తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. వీడియో సమావేశం అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ, ఎన్నికల కమీషన్ మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళలు, యువత, దివ్యాంగులను పోలింగ్‌లో భాగస్వామ్యం చేసేలా, ఆ సందేశం స్పష్టంగా తెలిసేలా మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పోలింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ప్రతీ ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు బీఎస్ లత, దివాకర, రిటర్నింగ్ అధికారులు నరసింహ మూర్తి, రాజేశ్వర్, నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

రాయికల్, నవంబర్ 27: అయోధ్య గ్రామానికి చెందిన కురుమ సంఘం అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు, ఇటిక్యాల గ్రామ బీఆర్ఎస్వీ యూత్ అధ్యక్షుడు శేఖర్ ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన 20 మంది యువకులు సోమవారం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి సంజయ్ కుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇక్కడ పలువురు నాయకులున్నారు.

### పొలాస ఆలయంలో జడ్జి ప్రత్యేక పూజలు

జగిత్యాల రూరల్, నవంబర్ 27: పొలాస గ్రామంలోని శ్రీ పౌలస్తేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా కరీంనగర్ జిల్లా జడ్జి ప్రతిమ సోమవారం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

### ఎమ్మెల్యేకు విరాళం అందజేత

జగిత్యాల రూరల్, నవంబర్ 27: జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కీర్తిశేషులు వీర్ల శంకర్ భార్య వీర్ల పద్మ సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు ఎమ్మెల్యే నివాసంలో కలిసి ఎన్నికల ఖర్చు కోసం రూ.10వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించారు. కార్యక్రమంలో నాయకుడు రాజేందర్ పాల్గొన్నారు.

### ఆలయాల్లో కార్తీక సందడి..

సారంగాపూర్, నవంబర్ 27: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని ఆయా ఆలయాల్లో కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం ఆలయాల్లో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పెంబట్ల శ్రీ దుబ్బ రాజేశ్వర స్వామి ఆలయం, రేచపల్లి శ్రీజగన్నాథ స్వామి, సారంగాపూర్ సీతా రామచంద్రస్వామి ఆలయం, బీర్‌పూర్ మండలంలోని శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి, హనుమాన్, తుంగూర్ గ్రామంలోని వేణు గోపాల స్వామి తదితర ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేసి దీపాలను వెలిగించారు. దుబ్బ రాజేశ్వర స్వామి, వేణుగోపాల స్వామి ఆలయాల్లో రాత్రి వైభవంగా కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా ఆలయాల ఆవరణలో లింగాకారంలో ఏర్పాటు చేసిన దీపాలను వెలిగించి దీపోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో దుబ్బ రాజన్న ఆలయ కార్యనిర్వాహణాధికారి అనూష, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కుట్రలను తరిమికొట్టండి

- బీఆర్ఎస్‌తోనే రైతులకు భరోసా
- కారు గుర్తుకే ఓటెయండి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్
- జగిత్యాల రూరల్, రాయికల్ మండలాల్లో ఎన్నికల ప్రచారం


మాట్లాడుతున్న సంజయ్ కుమార్

రాయికల్, నవంబర్ 27: ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అబద్ధపు హామీలు ఇస్తూ మోసం చేయాలని చూస్తున్నదని, ప్రజలు కాంగ్రెస్ కుట్రలను తరిమికొట్టాలని జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీతోనే పేదలకు భరోసా అని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి తనను మరోసారి గెలిపించాలని కోరారు. రాయికల్ మండలంలోని చెర్లకొండాపూర్, ఇటిక్యాల, రామారావుపల్లె, మూటపల్లి, ఒడ్డెర కాలనీ, కొత్తపేట గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి డా. సంజయ్ కుమార్ ప్రజలను కలిసి తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని ఇల్లు లేదన్నారు. ఇటిక్యాల, కొత్తపేట గ్రామాల్లో కోట్లాది రూపాయలతో చెక్ డ్యామ్ నిర్మించామన్నారు. గత ప్రభుత్వాలు ఏనాడైనా పేదింటి ఆడబిడ్డల పెండ్లికి పది రూపాయలైనా ఇచ్చారా అని, తెలంగాణ ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డల పెండ్లికి రూ.లక్ష 16 వేలను ఇచ్చి అండగా నిలుస్తున్నదన్నారు. కాంగ్రెస్ నాయకుడు జీవన్ రెడ్డి 40 ఏళ్ల కాలంలో నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదన్నారు. జీవన్ రెడ్డి, బీజేపీ నేత అరవింద్‌లాగే బాండ్ పేపర్ రాసి ఇచ్చి ఎమ్మెల్యే గా గెలిపిస్తే హామీలన్నీ నెరవేరుస్తానని మోసం చేసేందుకు ముందుకు వచ్చారన్నారు. 40 ఏళ్లలో చేయని అభివృద్ధి బాండ్ పేపర్ రాసిచ్చి చేస్తానంటే ప్రజలు నమ్మరన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తనను ఆశీర్వదించి మరోసారి జగిత్యాల ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సంధ్యారాణి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రాణి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచులు రాజ్యలక్ష్మి, లావణ్య, రాజేశం, తిరుపతి, వెంకమ్మ, తిరుమల్, ఎంపీటీసీ శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, ఉప సర్పంచులు వార్డు మెంబర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌తో విప్లవాత్మక మార్పులు

జగిత్యాల రూరల్, నవంబర్ 27: పేదలకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని, వ్యవసాయం, విద్య, వైద్యంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని జగిత్యాల బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. సోమవారం అంతర్గాం, ఒడ్డెరకాలనీ, జగిత్యాల అర్బన్ మండలంలోని అంబారిపేట గ్రామాల్లో సంజయ్ కుమార్ పర్యటించి కార్నర్ మీటింగ్‌ల్లో పాల్గొన్నారు. గ్రామాల్లో నాటి నీటి సమస్యలు అన్ని తొలగిపోయాయన్నారు. పెంబట్ల-రంగపేట గ్రామాల నీటి ఇబ్బందులతో గొడవలు జరిగేవన్నారు. జీవన్‌రెడ్డి చెప్పేవన్ని అబద్ధాలే అని విమర్శించారు. అతడి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. నాడు పెంబట్ల జగిత్యాల నియోజకవర్గంలో, రంగపేట బుగ్గారం నియోజకవర్గంలో ఉండేదని, రెండు గ్రామాల నీటి సమస్యను ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు రెండు గ్రామాలు జగిత్యాల నియోజకవర్గంలోకి వచ్చాయని, కెనాల్ నుంచి రంగపేట చెరువులోకి పైపులైన్ వేయడంతో రంగపేట తుమ్మల చెరువు, పెద్ద చెరువు నిండి కింది ఉన్న పెంబట్ల వరకు నీరు అందుతుందన్నారు. ఈ ఒక్క చర్య వల్ల రంగపేట, పెంబట్ల, కోనాపూర్, ఒడ్డెరకాలనీలకు నీటి సమస్య తీరిందన్నారు. జీవన్ రెడ్డి అమ్మమ్మ గ్రామమైన అర్పల్లి-తక్కళ్లపల్లి గ్రామాల మధ్య సైతం నీటి కోసం సమస్యలు ఉండేవన్నారు. చెక్ డ్యాం కట్టడంతో మోండి కుంట, పట్లేండ్ల కుంటలు నిండుకున్నాయని చెప్పారు. వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తున్న సర్కార్ కావాలా.. మూడు గంటల కరెంట్ ఇచ్చే సర్కార్ కావాలా అని ఆలోచించుకోవాలని సూచించారు. ఓటు వేసే ముందు ఆలోచించి ఓటు వేయాలన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో మాజీ ఏఎంసీ చైర్మన్ దామోధర్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు బాల ముకుందం, సురేందర్ రావు, సర్పంచులు గంగాధర్, రాజమణి, ఎంపీటీసీ శ్రీనివాస్, మల్లారెడ్డి, రవీందర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, నారాయణ రెడ్డి, మల్లారెడ్డి, ఆదిరెడ్డి, స్వామిరెడ్డి, సూర రెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల కలెక్టరేట్, నవంబర్ 27: పట్టణంలోని 47, 48 వార్డుల్లో, జగిత్యాల రూరల్ మండలంలోని వెల్దుర్తి, తిప్పన్నపేట, అంతర్గాం గ్రామాల్లో జగిత్యాల అభ్యర్థి డాక్టర్ ఎం సంజయ్‌కుమార్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.